క్లుప్తంగా

చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి : సీఎం సహాయ నిధి చెక్కులు పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం మండలాలకు చెందిన 60మందికి లబ్ధిదారులకు రూ.24లక్షల 32వేల విలువ గల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జెమ్మిలాల్, మున్సిపల్ అధ్యక్షులు వీరేష్, కృష్ణ, నాగరాజు, సుధాకర్, బాలకృష్ణ, భాస్కర్, రామోజీ, ప్రేమ్‌సాగర్, సైదానాయక్, భీమానాయక్, యాదగిరి, సుధాకర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని శ్రీవల్లికను అభినందించి నగదు బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయులు

నాగారం : మండల పరిధిలోని పసునూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థిని వడ్లకొండ శ్రీవల్లిక స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో లాంగ్ జంప్ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం బత్తిని విష్ణుమూర్తి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని శ్రీవల్లికను ఆయన అభినందించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో పాఠశాలకు చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయి లాంగ్ జంప్ విభాగంలో ఎంపిక కావడం గర్వకారణమన్నారు. అనంతరం విద్యార్థినికి రూ.500 బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై.హరికిషన్, కె.సైదులు, వై.శివకుమార్, కె.విజయలక్ష్మి, రాజు, శోభారాణి, కమల, వెంకన్న, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయంలో ద్వాదశి వేడుకలు



స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా బుధవారం క్షీరాబ్ది ద్వాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలమూర్తులకు, ఉత్సవ విగ్రహాలకు విశేష పంచామృతాభిషేకం, తులసి అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైకుంఠం నుంచి స్వామి నిద్ర మేల్కొని బృందావన తులసి వనంలోకి విచ్చేయడాన్ని పురస్కరించుకొని ప్రతి విష్ణు ఆలయాల్లో విశేష పూజలను నిర్వహిస్తున్నట్లు, అందులో భాగంగానే ఈ ఆలయంలో ప్రత్యేక వేడుకలను జరిపినట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు రాంబాబుఅయ్యంగార్, రామకృష్ణచక్రవర్తి పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

మద్దిరాల : మండల కేంద్రంలోని పెద్దచెరువు వెంట ఉన్న ప్రభుత్వ భూమి నుంచి అనుమతులు లేకుండా ఓ కాంట్రాక్టర్ జేసీబీ సహాయంతో మట్టిని తరలిస్తున్నారని బుధవారం గ్రామస్తులు వాపోయారు. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్‌కు మట్టిని తరలించేందుకు ప్రభుత్వం క్యూబిక్ మీటరుకు రూ.250లు ఇవ్వనుండగా ఒక్క ట్రాక్టర్‌లో రెండు క్యూబిక్ మీటర్లు పడుతుంది. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతుందని వెంటనే అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిలో నుంచి మట్టిని తరలించకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ను అడుగగా మట్టి తవ్వకానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

పాస్టర్ల సంఘం మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

మద్దిరాల : మండల కేంద్రంలో పాస్టర్ల సంఘం సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మండలంలోని కుక్కడం గ్రామానికి చెందిన జి.స్వామిదాసు యాదవ్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్వామిదాసు యాదవ్ మాట్లాడారు.

కళలకు వేదిక.. బాలభవన్

- చదువుతో పాటు ఆయా రంగాల్లో ప్రావీణ్యం పొందుతున్న చిన్నారులు
- జిల్లా కేంద్రంలో ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని బాలభవన్ లలిత కళలకు వేదికగా మారుతుంది. ఇటీవల ఆయా కళా రంగాలపై చాలా మంది విద్యార్థులు ఆసక్తి కనబరుస్తూ ఖాళీ సమయాన్ని వినియోగించుకుంటున్నారు. స్థానికంగా గల బాలభవన్‌లో సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణరెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులు డ్యాన్స్, కూచిపూడి నాట్యం, భరత నాట్యం, క్రాఫ్టు, ఆర్ట్స్, డ్రాయింగ్ తదితర అంశాలపై ఉచితంగా శిక్షణ పొందుతున్నారు. వారు ఇక్కడ నేర్చుకొని ఆయా కార్యక్రమాల్లో పాల్గొని పలువురి మన్ననలు సైతం పొందుతున్నారు. నేడు బాలల దినోత్సవం సందర్భంగా పలువురు బాలబాలికల అభిప్రాయాలు తెలుసుకుందాం.



సంగీత శిక్షణను పరిశీలిస్తున్న డీఈఓ అశోక్ (ఫైల్)

డ్యాన్స్ అంటే చాలా ఇష్టం



నేను తెలంగాణ ఆదర్శ పాఠశాల ఇమాంపేటలో పదోతరగతి చదువుతున్నాను. నాకు చిన్నతనం నుంచి డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. మా తల్లిదండ్రులు ప్రైవేట్‌గా శిక్షణ ఇప్పించలేకపోవడంతో అదే సమయంలో జిల్లా బాలభవన్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారని తెలిసి మా తల్లిదండ్రులు నన్ను బాలభవన్‌లో జాయిన్ చేశారు. నేను పేరిణి నాట్యంలో సర్టిఫికెట్, డిప్లొమా కూడా పూర్తి చేశాను.

– రూపశ్రీ, ఇమాంపేట మోడల్‌స్కూల్, పదోతరగతి

డ్రాయింగ్ నేర్చుకుంటున్నా



నేను 3సంవత్సరాల నుంచి సూర్యాపేట బాలభవన్‌లో ఉచితంగా డ్రాయింగ్ నేర్చుకుంటున్నాను. నాకు డ్రాయింగ్ అంటే చాలా ఇష్టం. డ్రాయింగ్‌లో మాస్టర్ చాలా మెళకువలు నేర్పిస్తున్నారు. పలు పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచాను. పైచదువులతో పాటు బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చేయాలని నా కోరిక.

– అఫ్రీన్, బాలభవన్ విద్యార్థిని

వాయిద్యం అంటే ఇష్టం



నేను జీహెచ్ఎస్ తిలక్‌నగర్ పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాను. నాకు చిన్నప్పటి నుంచి వాయిద్యాలు వాయించడం అంటే చాలా ఇష్టం. కానీ డబ్బులు చెల్లించి నేర్చుకోలేని పరిస్థితి. జిల్లా బాలభవన్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారని తెలిసి నేను బాలభవన్‌లో చేరాను. గత సంవత్సరం నుంచి ఇక్కడ శిక్షణ పొందుతున్నాను. చాలా ఆనందంగా ఉంది.

– బి.యశ్వంత్, బాలభవన్ విద్యార్థి

గాయకురాలిని కావాలని కోరిక



నాకు పాటలు పాడటం అంటే చాలా ఇష్టం. నేను కుడకుడ జెడ్పీహెచ్ఎస్‌లో ఆరో తరగతి చదువుతున్నాను. సూర్యాపేటలోని బాలభవన్‌లో ఉచితంగా శిక్షణ అందిస్తున్నారని తెలుసుకొని అందులో చేరాను. రెండు సంవత్సరాల నుంచి శిక్షణ పొందుతున్నాను. బాగా నేర్చుకొని ఒక గొప్ప గాయకురాలిగా కావాలని నా కోరిక.

– శ్రీలత, బాలభవన్ విద్యార్థిని

గ్రూప్-3కి పకడ్బందీ ఏర్పాట్లు

- 17, 18 తేదీల్లో పరీక్షలు
- 30 కేంద్రాల ఏర్పాటు
- హాజరు కానున్న 8951 మంది అభ్యర్థులు
- సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు

సూర్యాపేటటౌన్ : ఈ నెల 17, 18 తేదీల్లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్- 3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏఎస్పీ మేక నాగేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, రూట్ ఆఫీసర్లు, రీజనల్ కోఆర్డినేటర్లకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పరీక్షలకు సూర్యాపేట జిల్లా కేంద్రంలో 30 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 8,951 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించేటప్పుడు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తనిఖీ చేయాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ నాగేశ్వర్‌రావు

మొత్తం 68మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లను అందుబాటులో ఉంచామని, ప్రతీ అభ్యర్థి బయోమెట్రిక్ తీసుకోవాలన్నారు. ప్రతి కేంద్రంలో ఫర్నిచర్, తాగునీరు, మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంచాలని కోరారు. పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేషులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

అర్వపల్లి : సూర్యాపేట పట్టణంలో ఈనెల 26న నిర్వహించే టీఎమ్మార్పీఎస్ విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగదెరి శ్రీనివాస్, బొర్ర శైలేందర్ కోరారు. బుధవారం అర్వపల్లిలో సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో ధర్మం గెలవడంతో ఈ విజయోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇటికాల చిరంజీవి, మండల అధ్యక్షుడు సూరారపు సైదులు, పరమేశ్, పరుశరాములు, శ్రీను, బి.సైదులు, ఆర్.శేఖర్, నాగరాజు ఉన్నారు.

ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించాలి

- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం



ఆక్సిజన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ కోటాచలం

సూర్యాపేటటౌన్ : ఆస్పత్రిలో 24గంటల ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జీజీహెచ్ ఆసుపత్రిలో వైద్యసిబ్బందితో మాక్ కోవిడ్ డ్రిల్ నిర్వహించారు. ఆక్సిజన్ స్టోరేజ్ ప్లాంట్ పరిశీలించి ఆక్సిజన్ గ్యాస్ ప్లాంట్‌ను, స్టోరేజ్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. అదే విధంగా మైక్రో బయాలజీ ల్యాబ్‌ను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ, మైక్రోబయాలజీ డాక్టర్ రూతు రమ్య, డాక్టర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీకి పెరుగుతున్న ఆదరణ



సమావేశంలో మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

పెన్‌పహాడ్ : తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి రోజురోజుకూ ఆదరణ పెరుగుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంస్థాగత ఎన్నికల ప్రక్రియ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కమిటీల ఏర్పాటుతో పార్టీని బలోపేతం చేయాలన్నారు. మండలంలోని 40 పోలింగ్ బూత్‌లలో నూతన కమిటీలు ఏర్పాటు చేసేందుకు 5శక్తి ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. ఈనెల 20 నుంచి 25వరకు బూత్ కమిటీలను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 83,319 సభ్యత్వాలు చేసినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేక మొదలైందన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కర్నాటి కిషన్, చలిగంటి వీరేంద్ర, మండల అధ్యక్షులు పోకల రాములు, చల్లమల్ల నర్సింహ, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు నెమ్మాది నరేష్, తూముల సాయి, అబీద్, శోభారెడ్డి, తాళ్లపల్లి మధు, విజయ్‌కుమార్, బైరెడ్డి రాంరెడ్డి, యగ్గడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం ఎస్ఐ నీలిమ, హాజరైన విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు, యువత సైబర్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని షీటీం ఎస్ఐ నీలిమ అన్నారు. బుధవారం పట్టణంలోని సాయి గౌతమి జూనియర్ కళాశాలలో షీటీంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. షీటీమ్స్, సైబర్‌నేరాలపై, గంజాయి, డ్రగ్స్, మత్తు మందులు, గుట్కా నిషేధానికి పటిష్టంగా పనిచేస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో, స్కూళ్లలో, కళాశాలలో, వసతిగృహాలలో చదువుకునే విద్యార్థులు, యువతి, యువకులు ఇంటర్‌నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంక్‌ఖాతా, ఆధార్‌కార్డు వివరాలు తెలియని వారికి తెలపొద్దన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీనంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో షీటీమ్స్ ఏఎస్ఐ సాలయ్య, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది రేవతి, వినోద్, తేజస్విని, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యమ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

సూర్యాపేట : మాదిగ విద్యార్థి, యువకులు ఎమ్మార్పీఎస్ ఉద్యమ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ, ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకుడు వెంకటస్వామి మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల ఉమ్మడి నల్లగొండ జిల్లా సమీక్ష సమావేశాన్ని చింత వినయ్‌బాబు మాదిగ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మంద కృష్ణమాదిగ నేతృత్వంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఏర్పడిన తర్వాతనే మాదిగ జాతికి ఆత్మగౌరవం, గుర్తింపు వచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మొదలైన ఎమ్మార్పీఎస్ ఉద్యమం లక్ష్యసాధన కోసం ఏకంగా భారత ప్రధానమంత్రిని కూడా కదిలించిన చరిత్ర ఉందన్నారు. 15రోజుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నూతన మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు జానకి రామయ్య, కందుకూరి సోమన్న మాదిగ, యాతాకుల రాజన్న, చింతలపాటి చిన్నశ్రీరాములు, మల్లెపాక వెంకన్న, బొజ్జ సైదులు, బకరం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందు నరేష్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నూతనకల్ : మండల కేంద్రంతో పాటు, మండల పరిధిలోని యడవెల్లి, దిర్శనపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామానికి గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రణయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మద్దిరాల : మండలంలోని గోరెంట్ల గ్రామ 11కేవీ ఫీడర్‌కు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా ఆ ఫీడర్ పరిధిలోని గోరెంట్ల, చౌళ్లతండా గ్రామాలకు నేడు ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ పి.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాగారం : మండల కేంద్రంలోని 33కేవీ సబ్‌స్టేషన్, ఫణిగిరిలోని 33కేవీ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈఈ మహేంద్రకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగారం పరిధిలో నాగారం, ఫణిగిరి పరిధిలో మామిడిపల్లి గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

అర్వపల్లి : అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం గ్రామాలలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా గురువారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ వాస శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతుల వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలి

- ఆర్డీఓ వేణుమాధవ్‌రావు

ఆత్మకూర్(ఎస్) : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కాంటాలు వేసిన వెంటనే రైతుల వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని ఆర్డీఓ వేణుమాధవరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తుమ్మల పెన్‌పహాడ్, ఆత్మకూరు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాలలోని రికార్డులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కేంద్రాలలో వెంట వెంటనే కాంటాలు వేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలన్నారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ధరణి పెండింగ్ ఫైల్స్ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ హరిచంద్రప్రసాద్, ఆర్ఐ స్వప్న, ఏపీఎం మంజుల, సీసీలు తదితరులు ఉన్నారు.

అర్వపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లకు సంబంధించి నిర్వాహకులు ట్యాబ్ ఎంట్రీలను వెంటవెంటనే పూర్తిచేయాలని ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి సూచించారు. బుధవారం మండల పరిధిలోని లోయపల్లి, కొమ్మాల తదితర గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయా కేంద్రాలలో రిజిస్టర్లను పరిశీలించారు. రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. కాంటా వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. నిర్వాహకులు, రైతులు ఉన్నారు.



ఆత్మకూర్(ఎస్) : ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

మద్దిరాల : మండల పరిధిలోని గోరెంట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ అమీన్‌సింగ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరతో పాటు, సన్న ధాన్యానికి అందించే బోనస్ రూ.500లను పొందాలని అన్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు ధాన్యం తేమ శాతం పరిశీలించి మ్యాచ్యూర్ వచ్చిన ధాన్యాన్ని కాంటాలు వేయాలని సూచించారు. ఆయన వెంట ఏపీఎం మైసయ్య, వీబీకేలు, రైతులు ఉన్నారు.



మద్దిరాల : ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్

ముమ్మరంగా సాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

మద్దిరాల : సమగ్ర ఇంటింటి సర్వే మండల కేంద్రంతో పాటు పరిధిలోని అన్ని గ్రామాలలో ముమ్మరంగా సాగుతున్నట్లు తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గోరెంట్ల గ్రామంలో నిర్వహించిన సర్వేలో తహసీల్దార్ అమీన్‌సింగ్ పాల్గొని ప్రజల నుంచి వివరాల సేకరించి మాట్లాడారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎన్యుమరేటర్లు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్వే సిబ్బందికి సహకరించాలి

అర్వపల్లి : కుటుంబ సమగ్ర సర్వేకు వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి కోరారు. మండల పరిధిలోని తిమ్మాపురం, లోయపల్లి, కొమ్మాల గ్రామాలలో బుధవారం నిర్వహించిన ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లకు ఇంటింటి సర్వేకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు డి.నవీన్ రెడ్డి, గంట యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి : సర్వే ఫారాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

భూమిని పట్టా చేసుకున్న వారిపై చర్య తీసుకోవాలి

మద్దిరాల : తన భాగానికి వచ్చిన వ్యవసాయ, ఇంటి భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న తన అన్నపై చర్య తీసుకోవాలని బుధవారం ఓ బాధితుడు వాపోయాడు. వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నవ్వుల అనంతరామిరెడ్డి, మల్లారెడ్డి ఇద్దరు అన్నదమ్ములు. అనంతరామిరెడ్డి ఎన్ఆర్ఐగా విదేశాల్లో ఉంటుండగా అన్న మల్లారెడ్డి స్థానికంగా ఉంటూ వ్యవసాయం చేస్తుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో అనంతరామిరెడ్డి భాగానికి వచ్చిన భూమిని అన్న మల్లారెడ్డి అక్రమంగా పట్టా చేసుకున్నాడు. దీంతో విషయం తెలుసుకున్న అనంతరామిరెడ్డి తన భూమి విషయంపై అన్నను నిలదీయగా, ఈ భూమి కోసం నాకు రూ.10లక్షల అప్పు అయ్యిందని అవి ఇస్తే నీ భూమి నీకు పట్టా చేస్తానని చెప్పి తన నుంచి రూ.10లక్షలు తీసుకున్నాడని, అయినా పట్టా చేయకుండా తన అన్న ఇబ్బందులు పెడుతున్నాడని అనంతరామిరెడ్డి తెలిపాడు. అదే విధంగా గ్రామంలో ఇద్దరి పొత్తుల ఉన్న ఇంటి స్థలాన్ని కూడా తెలియకుండా గ్రామ అధికారి సహకారంతో మొత్తం అతడి పేరు మీదనే ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నాడని బాధిత ఎన్ఆర్ఐ అనంతరామిరెడ్డిని వాపోయాడు. తన సొంత సోదరుడే ఇబ్బందులు పెడుతున్నాడని, తన భూమిని ఇప్పించాలని కోరుతూ ఇటీవల కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

కాళోజీ అడుగుజాడల్లో నడవాలి



కాళోజీ నారాయణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తుంగతుర్తి : ప్రజాకవి కాళోజీ నారాయణరావు అడుగుజాడల్లో నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కాళోజీ నారాయణరావు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రాంతానికి, తెలంగాణ భాష, సాహిత్యానికి కాళోజీ చేసిన సేవలు మరువలేనివన్నారు. ప్రజల గొంతుకగా జీవితాంతం బతికిన కాళోజీ చిరస్మరణీయులని ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు గుండగాని రాములు, మట్టపల్లి వెంకటేష్, ఉప్పుల నాగమల్లు, బొంకూరి మల్లేష్, తిరుపతి పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

అర్వపల్లి : మండలంలోని విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓటు వేసే విధానంపై తెలియజేశారు. అలాగే సాధారణ ఎన్నికల కార్యక్రమాన్ని జరిపి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ పులిజాల వేణుగోపాల్‌రావు, హెచ్ఎం అనంతోజు వీరాచారి మాట్లాడారు. ఓటు హక్కును రాబోయే రోజుల్లో ప్రతిఒక్క విద్యార్థి వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం కార్యదర్శి ఎం.మహేష్‌గౌడ్, రమేష్, వెంకన్న, సిద్దు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అర్వపల్లిలోని విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్‌లో ఓటును వినియోగించుకుంటున్న విద్యార్థులు

సంజీవరెడ్డి మృతి తీరనిలోటు

ఆత్మకూర్(ఎస్) : మండలం కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తంగేళ్ల సంజీవరెడ్డి(68) మృతి పార్టీకి తీరనిలోటని బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తంగేళ్ల కరుణాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం సంజీవరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు తంగేళ్ల లక్ష్మీ వీరారెడ్డి, నాయకులు ముస్కు రామ్‌చంద్రారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సిగ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు పచ్చిపాల వెంకన్న, జమాడ్ల సత్యనారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటరెడ్డి, నాగభూషణచారి తదితరులు ఉన్నారు.

విగ్రహం ఏర్పాటుకు విరాళం



విరాళం అందజేస్తున్న దాత కృష్ణమూర్తి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య విగ్రహానికి గ్రామానికి చెందిన బింగి లింగయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు బింగి రమేష్, బింగి కృష్ణమూర్తి బుధవారం నిర్వాహకులకు రూ.31,116లు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో దొడ్డి కొమురయ్య యూత్ సభ్యులు గట్టిగొర్ల లింగమల్లు, వల్లాల కోటి, పోలెబోయిన కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా ఇచ్చి ఆదుకోవాలి

నూతనకల్ : ప్రభుత్వం రైతులకు రైతుభరోసా అందించి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు తొట్ల ప్రభాకర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు రైతుభరోసా అందించకపోవడంతో వ్యవసాయ పెట్టుబడులకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వ్యవసాయానికి సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడానికి పెట్టుబడి లేకపోవడంతో వ్యవసాయ దిగుబడులు తగ్గుతున్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం రైతుభరోసా అందించాలన్నారు. ఆయన వెంట యానాల వెంకట్‌రెడ్డి, లింగయ్య, రవి ఉన్నారు.

న్యాయవాదులపై దాడులను అరికట్టాలి

కోదాడరూరల్ : న్యాయవాదులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఆర్‌కె మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో న్యాయవాదిపై దాడి చేయడాన్ని ఖండిస్తూ బుధవారం విధులు బహిష్కరించి స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయవాదులపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని, న్యాయవాదుల రక్షణకు సమగ్ర చట్టం రూపొందించి దానిని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు గట్ల నర్సింహారావు, సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, కోడూరు వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

పశు వైద్యశిబిరం

అర్వపల్లి : పశువులకు వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా ఉచితంగా అందించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి బి.అర్జున్ కోరారు. మండల పరిధిలోని వీర్యనాయక్‌తండాలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పశువులకు టీకాలను వేశారు. కార్యక్రమంలో వీఎల్ఓ కేఎస్ఎస్.పద్మ, ఓఎస్ మధుసూదన్, యాకయ్య, గోపాలమిత్రలు ఆల్డాస్ లింగయ్య, అర్జున్, రైతులు పాల్గొన్నారు.